

శ్రీ మల్లాది వేంకటకృష్ణశర్మ

శోభనాద్రి 34 సంవత్సరముల వయస్సు కలవాడు - చామనచాయ శరీరం కాస్త లావుగా వుంటాడు. మీసం ఉండదు. తిలతండుల న్యాయంగా నిగనిగలాడుతూ ఉంటుంది క్రాప్. సగంచేతులలాల్చీ, గుండారూ...శ్రీమతి నడి వయస్సులో వున్నమనిషి. చాలా అప్టూడేట్ గెటప్. కొప్పు చక్కగా కెరటాలవలె దువ్వి పువ్వులు ముడుచుకొని, తెల్లనిచీరా, జంపరు జాకెట్టూ దరించి, అలంకారాలు అట్టే లేకపోయినా సన్నని గొలుసు సొగసుగా వేసుకొని ఆకర్షణీయంగా ఉంటుంది. రాత్రి 10 గంటల వేళ - గోడకు చిమ్నీతో దీపం తగిలింపబడి ఉంది. శోభనాద్రి ఈజీఛైరులో కూచొని చుట్ట కాలుస్తూ వుంటాడు. శ్రీమతి ఎదురుగా పందిరి మంచంమీద కూచొని ముందు పాన్‌దాన్ పెట్టుకొని తాంబూలం వేసుకుంటూ వుంటుంది.

కొంతసేపు నిశ్శబ్దం.

శోభ:—(పొగ చక్రంలాగ విడిచిపెట్టి చుట్ట దులిపి ఈజీఛైరుకు చారబడి - దీర్ఘంగా నిట్టూర్పువిడిచి పెడతాడు)

శ్రీమతి:—(పాందాను మూసి మంచంకింద పెట్టి, తలగడా మంచంయొక్క వెనుకచక్కీకి ఆనించి, చారబడి - దీర్ఘంగా నిట్టూర్పువిడిచి పెడుతుంది)

శోభ:—(పెదవివిరచి) పోయింది-పోయింది-పోయింది. నాసీతతో నా సమస్త సౌఖ్యమూ పోయింది. చచ్చిపోతేగాని మనిషి లేని లోపం కనిపించదు కదా?

శ్రీమతి:—నా ఆనందం - నా దర్జా - నా గొప్ప తనం అంతా ఆయనతోనే పోయింది. ఆహా - అతడు ఎలాటి మనిషండీ -

శోభ:—శ్రీమతీ! నువ్వు దాన్ని ఎరగవు కాని, ఎంత మంచిదనుకున్నావు - వెతుకుతే చెడుగుణం లేదు.

శ్రీమతి:—ఆయన, సత్యసంధుడు ధర్మరాజు.

శోభ:—(జేబునుండి ఫోటోతీసి నిదానంగా చూచి, నిట్టూర్పు విడిచి) ఓ పంకజాక్షీ నీయట్టి సౌందర్యవతి నాబోటివాని కెట్లు దక్కును.

శ్రీమతి:—(జాకెట్టులోపలినుండి ఫోటోతీసి నిదానంగాచూస్తూ) ప్రాణనాథా! నీయనన్య సామాన్య సౌందర్య మీభూమియందు గలదే ...ఇంద్ర చంద్రవ సంతజయంతకంతులను ధిక్కరించు నీయట్టి సుందరుడు నా కెట్లుదక్కు.

శోభ:—(ఫోటో నుదహరించి) ప్రాణకాంతా! నీవు నన్ను నాథునిచేసి చనుట న్యాయమా?

శ్రీమతి:—(ఫోటో నుదహరించి) ప్రాణనాథా! నీవు నన్నీయగాధప్రణయ భీభత్స మహాసముద్రమున విడిచి చనుట భావ్యమా —

శోభ:—ఓ నాయొక్క మందగజగామినీ — నీవునన్ను కుంత కలకంత కంటకావృక మహారణ్య కీకారణ్యాకాంతార కాననవన సముద్ర తీరమున బడవైచి చనుట ధర్మమా?

శ్రీమతి:—కాలకేయాది దుష్ట రాక్షసులం దునిమి, శివునివలన పాశుపతాస్త్రము వహించి యస్త్ర శాస్త్ర విచక్షణుండన వాసికెక్కిననీ కునన్నదను చేయుట న్యాయమా?

శోభ:—ఓ తరుణీమణీ — ఎందుంటివి...స్వర్గ మర్త్య పాతాళలోకంబుల కరిగితివా?

శ్రీమతి:—ఓ ప్రాణనాథా — నీవు తొందర పడి మరణించి యక్షగరుడ గంధర్వకింపురుష తిర్యగ్ వర్గలోకంబుల కరిగితివా?

శోభ:—(కోపంతో) ఆ వెధవ నరకానికే వెళతాడు.

శ్రీమతి:—ఆ ముండ నరకానికే వెళుతుంది.

శోభ:—ఆమె పేరు తలుచుకుంటే, నీ పాపాలన్నీ పోతాయి, ఆహా! ఆమె ఎంతయోగ్యురాలు.

(పద్యం) చెప్పినట్లెల్ల వినియెడు చేడెతోడ
స్వర్గమున కేగలేక జీవచ్ఛవంబు
వోలె బ్రదికియుంటినీ... ...

శ్రీమతి:—ఆయన చనిపోయినవెంటనే నేనూ బలవంతాన చచ్చివుంటేనా?

శోభ:—కొసకు వజ్రంపోయి గాజుముక్క వచ్చింది కదా అని విచారిస్తున్నాను.

శ్రీమతి:—నేనూ డిటో......

శోభ:—ఆరోజుల్లో ఇల్లుపట్టకుండా నీకోసం తిరుగుతూ వుండేవాణ్ణి...రాత్రి నీతో ఉండి వుండీ, ఎప్పుడో యింటికి వచ్చేవాణ్ణి — పాపం— అలాగే కనిపెట్టుకొని వుండేది...

శ్రీమతి:—అది ఆడది...మా ఆయన మగాడు కద — ఆరోజుల్లో రాత్రిళ్ళుకూడా నన్ను మీరు అంతసేపు ఉంచేశేవారు నేను తిరిగివచ్చేదాకా ఆయన అరుగుమీద పాపం అలాగే కుస్సు కుస్సు దగ్గుతూ కూచునేవారు...

శోభ:—కోపంవచ్చి అప్పుడప్పుడు చితక తన్నేవాణ్ణి, ఎందుకనేనా అనేదికాదు. పాపం.

శ్రీమతి:—ఆయనా ఉన్నప్పటినుంచీ మనకీ స్నేహం ఉందికదా.

శోభ:—అదే ఇంత కొంపతీసి పెళ్ళివరకూ తెచ్చింది...

శ్రీమతి:—ఒకనాడు రూళ్ళకఱ్ఱతో కొట్టేశాను - ఆ దెబ్బతో మంచం పట్టిపోయారు - మరి లేవలేదు ..మీకూ నాకూ అంతజోస్తీ అని ఆయనకు తెలుసును, తెలిసుండికూడా ఏమీ అనలేదు...ఆయన గొప్ప వేదాంతి ..

శోభ:—ఆమెది గొప్ప ఓర్పు...

శ్రీమతి:—అతడు ఋషి...

శోభ:—ఆమె మహా పతివ్రత...

శ్రీమతి:—మరి గొప్ప చెప్పకండి మీ మొదటివైఫ్ వట్టి క్రేక్ అని లోకంలో వాడుక.

శోభ:—నీ మొదటి మొగుడు ఆడాదిదద్దమ్మ అని లోకంలో వదంతి.

శ్రీమతి:—ఆయన సంఘ సంస్కర్త ఆడదాని హక్కుకోసం ఆయన పోట్లాడి - అందుకు ఆదర్శంగా నన్ను తయారుచేసి ఆయన మరణించారు. పాపం ఆయన మరణిస్తూ నన్ను పిలిచి - నువ్వు చిన్నదానివి - నీకు మగదక్షతి అవసరం, కనక నేను లేనని విచారించక, వెంటనే తగినవాణ్ణి పెండ్లిచేసుకో అని చెప్పి మరణించారు. భార్య భర్తమాట అతిక్రమించకూడదు కదా అని మిమ్మల్ని పెండ్లాడాను.

శోభ:—పాపం - మా ఆవిడా అలాగే సుమీ - మీకు నేను లేనిలోపం ఉండకూడదు, కాస్త కాలుకీ - చేతికీ అయినదాన్ని వెంటనే పెండ్లాడండి, అని మరీ మరీ చెప్పి ప్రాణంవిడిచిపెట్టింది. అలాటి భార్య పోయిందని వినకుండానే ప్రాణం విడిచిపెట్టవలసింది...

శ్రీమతి:—అలాటి భర్త గతించిన తరవాత పెళ్లేమిటి వెంటనే చచ్చిపోవలసింది.

శోభ:—ఇంకా మించిపోలేదు ఆపని ఇప్పుడెందుకు చెయ్యకూడదూ?

శ్రీమతి:—తమరో...తమరు మళ్ళా పెళ్ళాడతారా?

శోభ:—పెళ్ళాడినా విడోని మాత్రం పెళ్ళాడను.

శ్రీమతి:—ఈప్రాణం ఇంక మీతోనే......

శోభ:—నీలాంటి భార్యను కట్టుకున్నకంటె చావే మేలు.

శ్రీమతి:—నాకూ అలాగే అనిపిస్తూంది.

శోభ:—అయితే ఉండు చెబతాను (దిగ్గున లేచి పెరటిలోకి వెళ్ళి రెండు పొడుగాటి తాళ్లు తెచ్చి) మంచం దిగి క్రిందికి రా? (దిగువ కూచుంటాడు.

శ్రీమతి:—(దిగువకూచుంటుంది)

శోభ:—ఇది నీమెడకు చుట్టుకో - ఇది నా మెడకు చుట్టుకుంటాను - నామెడలో తాడు నువ్వుపట్టుకొని బిగించు నీమెడలోతాడు నేను పట్టుకొని బిగిస్తాను - ఇద్దరం ఒక్కమారు చనిపోదాం ..

శ్రీమతి:— అమ్మ! ఎంతఎత్తు! మగాడికున్నంత బలం ఆడదానికుంటుందా? మీరు ముందు బిగించి నన్ను చంపడానికా?

శోభ:—అయితే ఎవరిమెడలో తాడు వాళ్ళమే బిగించుకుందాం - నేను వన్, టూ, త్రీ, అంటాను, త్రీ అనేటప్పటికి ఒక్కసారి ఇద్దరి శవాలూ భూమిమీద వ్రాలిపోవాలి.

శ్రీమతి:—ఇంకా అది బా[illegible]కున్నాను.

శోభ:—అయితే బిగించి రెండుచేతులతోనూ, ఇలాగ పట్టుకో...(ఆమె మెడకు తాడు చుట్టబెడతాడు) ఇదిగో, జాగ్రత అంటున్నాను-(తనమెడకు తాడు చుట్టబెట్టుకుంటాడు) వన్ - టూ.....ఇదిగో అనేస్తున్నాను - జాగ్రత... దాహం వేస్తూంది కాస్త మంచినీళ్లిద్దూ.

శోభ:—వన్ - టూ...అన్నట్టు చూశావా ముఖ్యమైన సంగతి మరిచిపోయాం...ఒక్కసారి దేవుణ్ణి ప్రార్థించుకోవద్దూ...(కళ్ళుమూసుకొని చేతులు జోడించి) శుక్లాం బరధరం విష్ణుం, శశి వర్ణం చతుర్భుజం, ప్రసన్నవదనం ధ్యాయే, సర్వవిఘ్నో పశాంతయే...మహాప్రభో, శంభో శంకర జన్మజన్మాలకూ నాకు సెకెండ్ హేండ్ వైఫ్‌ని పెళ్ళిచెయ్యకు తండ్రీ.



శ్రీమతి —ఊపనేదో కానివ్వండి తరవాత తెస్తాను.

శోభ:—అయితే కాచుకో అనేస్తున్నాను - వన్. టూ...నువ్వింకా బిగించి పట్టుకోవాలి... వన్, టూ అనేస్తున్నాను సుమా!

శ్రీమతి:—ఎందుకలా అనేస్తున్నానని దడిపిస్తారు - అనండి వేగం...

శ్రీమతి:—(కళ్లుమూసి శిరస్సువంచి నమస్కరించి) బ్రహ్మార్పణం కేవలం - ఓ తండ్రీ నా పాపములన్నియు అపహరింపుము.

శోభ:—ఏయ్ - ఇటుచూడు - నువ్వీ సమాజపు ప్రార్థన ప్రారంభిస్తే నాకు టైమ్ లేదు - ఏదో శ్లోకం చదివి టకీమనిపించు.

శ్రీమతి:—నాకు శ్లోకాలురావు (కళ్లుమూసి చేతులు మోడ్చి నేను ఈ దినమున చేసిన...

శోభ:—అన్నా! ఇహ దీని అబద్ధపు డైరీ దేవునిముందు వినిపిస్తుంది కాబోలురా దేవుడా?

శ్రీమతి:—అబ్బ! ఎంత తొందర.

శోభ:—నాకు నిద్దరొస్తూంది...

శ్రీమతి:—నాకు రాలేదూ? (కళ్లుమూసి నమస్కరించి) ఓ పరమేశ్వరా ఏ జన్మలోకూడా నాకు విడో మేరియేజ్ చేయించకుము.

శోభ:—బాస్ - స్టాప్.. ఇహ రడీగావుండు. వన్ - టూ - రడీ...త్రీ......(ఇద్దరు గొంతు బిగించుకొని నేలమీదికి ఒరుగుతారు. కొంత సేపు నిశ్శబ్దం)

శోభ:—(అలాగ నేలమీద వాలిపోయి వుండే, జేబునుండి చుట్టా, అగ్గిపెట్టె, తీసి చుట్ట ముట్టించి పొగ ఒదులుతాడు.)

శ్రీమతి:—(గట్టిగా దగ్గి, తాంబూలం తుంపరలు అతని మొహంమీద పడేటట్టు తుమ్ముతుంది.)

శోభ:—(దిగ్గునలేచి) ఎంతఘోరం - నిన్ను నమ్మి నిజంగా నేను చచ్చిపోయివుంటే!

శ్రీమతి:—మిమ్మల్ని నమ్ముకొని నేను చచ్చిపోయివుంటే! - (లేచి)

శోభ:—ఈ ఆడజాతిని నమ్మకూడదురా మహాప్రభూ!

శ్రీమతి:—ఈ మగజాతిని నమ్మచ్చు కాబోలు.

శో:—కొసకు చావుకు తెగించినా ఈ అశాంతిపోయింది కాదు. మనలో మనకు ఈ అభిప్రాయ భేధాలు పోవడం యెలాగ.

శ్రీమతి:—మలలో మనం అన్యోన్యంగా ఉంటే...

శోభ:—అలాగయితే, నువ్వూ నా తొలి భార్యను మరచిపోయేటట్టు నా వద్ద ప్రవర్తించాలి.

శ్రీమతి:—మీరు నా తొలిభర్తను మించిపోయేటట్టు ప్రవర్తించాలి.

శోభ:—అంతకన్నా సులువు చెప్పనా? నేను నా తొలిభార్యనూ, నీవు నీ తొలిభర్తనూ మరచిపోతే...

శ్రీమతి:—అది నిజం - అలాగయితే [illegible] గేరూ...

శోభ:—నీదగ్గిర ఉన్ననీ మొదటిభర్త ఫోటో తియ్యి - (దూరాన్నవున్న చిత్తుకాగితాలు తెచ్చి చించి పోగుపెట్టి) దీనికి నిప్పు ముట్టిస్తాను. అందులో ఈ రెండు ఫోటోలూ పడేసి సుఖంగా వుందాం.

శ్రీమతి:—ఇద్దరం ఒక్కమారె వేదాం.

శోభ:—(పోగుపెట్టిన కాగితాలకు నిప్పుపుల్ల ముట్టించి, తనజేబులోని ఫోటో తీసి అందులో పడవేస్తాడు.)

శ్రీమతి:—(తనచేతిలోవున్న ఫోటో మంటలో వేస్తుంది.)

(తెర)

---


## మన్మథ శాస్త్రము

ముఖ్యముగ అందఱు చదువవలసినది

వెల 8 అణాలు

దిఓరియంటల్ బుక్ డిపో మద్రాసు